25 వరకు ఓపెన్ స్కూల్ పరీక్షల ఫీజు గడువు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఎస్ఎస్‌సి, ఇంటర్ పరీక్షల ఫీజును ఈనెల 25వ తేదీ లోగా చెల్లించాలని జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఎస్ఎస్‌సి సబ్జెక్టుకు రూ.100, ఇంటర్ పరీక్షకు సబ్జెక్టుకు రూ.150 చొప్పున చెల్లించాలని సూచించారు. రూ.25 అపరాధరుసుముతో ఈనెల 26 నుంచి 29వ తేదీ లోపు చెల్లించాలని, రూ.50 అపరాధరుసుములో 31వ తేదీ లోపు చెల్లించవచ్చని తెలిపారు. వచ్చే నెల వరకు తత్కాల్ ఫీజు చెల్లించేందుకు వీలు కల్పించినటు పేర్కొన్నారు. గతంలో ప్రవేశం పొంది, ఉత్తీర్ణత కాని వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'ఉపాధి' కుదింపు

- మూడేళ్లుగా ఉపాధి నిధులకు కేంద్రం కోత
- 2020-21లో రూ.993 కోట్లు
- గతేడాది రూ.590 కోట్లకు తగ్గిన ఖర్చు
- కూలీలకు పనుల కల్పనపై ప్రభావం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే చర్యలకు పాల్పడుతోంది. ప్రతి ఏడాదీ బడ్జెట్‌లో నిధుల కోత పెడుతోంది. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో పేర్కొన్న గణాంకాలే ఇందుకు ఉదాహరణ. జిల్లాకు సంబంధించి ప్రతి సంవత్సరం అంతకంతకూ నిధులు తగ్గిస్తోంది. బడ్జెట్‌లో నిధులు తగ్గడంతో క్రమేణా వ్యయం తగ్గుతోంది. కూలీలను తగ్గించుకోవడానికి యాక్టివ్, నాన్ యాక్టివ్ కూలీలుగా విభజించింది. దీంతోపాటు మొబైల్ యాప్ ద్వారా మస్టర్లు, ఫేషియల్ అటెండెన్స్ వంటి షరతులతో కూలీలను ఉపాధికి దూరం చేసే విధానాలను అవలంభిస్తోంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ప్రస్తుతం 920 పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు అమలవుతున్నాయి. జిల్లా నీటి యాజమాన్య సంస్థ లెక్కల ప్రకారం జిల్లాలో 4.34 లక్షల జాబ్‌కార్డులను జారీ చేశారు. వీటిలో 3.82 లక్షల కార్డులు మాత్రమే మనుగడలో ఉన్నట్లు చెప్తున్నారు. 7.52 లక్షల మంది కూలీలు ఉండగా పనుల్లోకి చురుగ్గా వస్తున్న వారు 6.16 లక్షల మంది మాత్రమే ఉన్నారు. పనుల కోసం ప్రభుత్వం ప్రతి సంవత్సరం కేంద్ర ప్రభుత్వం జిల్లాకు లేబర్ బడ్జెట్‌ను కేటాయించి, అందుకనుగుణంగా ఖర్చు చేస్తోంది. ఈ ఖర్చు క్రమేణా తగ్గుతోంది. 2020-21 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పనుల కోసం రూ.993.08 కోట్లను ఖర్చు చేశారు. ఆ తర్వాత ఆర్థిక సంవత్సరంలో రూ.620.51 కోట్లను వెచ్చించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.590.30 కోట్లను ఖర్చు చేసింది. ఈ సంత్సరం ఇప్పటివరకు రూ.188.89 కోట్లను వెచ్చించింది. బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గడంతో చేపడుతున్న పనులూ తగ్గుతున్నాయి. 2020-21లో 1.02 లక్షల పనులు చేపట్టగా, ఆ తర్వాత సంవత్సరంలో 75 వేల పనులు చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో 77 వేల రకాల పనులు చేపట్టారు.

బడ్జెట్ కుదింపుతో పని దినాలపై ప్రభావం

ఉపాధి హామీకి బడ్జెట్‌లో నిధులు తగ్గించడంతో క్రమేణా పని దినాలు తగ్గుతున్నాయి. 2020-21 ఆర్థిక సంవత్సరంలో 2.69 కోట్ల పనిదినాలు కల్పించగలిగారు. 2021-22 సంవత్సరంలో రూ.2.18 కోట్ల పనిదినాలు కల్పించారు. గతేడాది రెండు కోట్ల పని దినాలను కల్పించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 53 లక్షల మందికి పనులు కల్పించారు. కుటుంబానికి కనీస పని దినాలు ఇచ్చి ఉపాధి కల్పించడంలో క్రమేణా తగ్గుదల కనిపిస్తోంది. 2020-21లో ఒక్కో కుటుంబానికి సగటున 61.5 రోజులు పని ఇచ్చారు. ఆ తర్వాత ఆర్థిక సంవత్సరంలో 51.15 రోజులు పని చూపించారు. గతేడాది 60.65 రోజులు ఉపాధి చూపించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 22.94 రోజులు పని ఇచ్చారు. కుటుంబానికి వంద రోజులు పని కల్పించడంలోనూ క్షీణత కనిపిస్తోంది. 2020-21 ఆర్థిక సంవత్సరంలో 87,452 కుటుంబాలకు వంద రోజులు పని కల్పించారు. ఆ తర్వాత సంవత్సరంలో మూడో వంతు కుటుంబాలకూ వంద రోజులు పని ఇవ్వలేకపోయారు. కేవలం 25,706 కుటుంబాలకు పని ఇచ్చారు. గత ఆర్థిక సంవత్సరంలో 49,915 మందికి వంద రోజులు పని ఇచ్చారు.

ఎస్‌సి, ఎస్‌టిలకు పని కల్పనలోనూ వెనుబాటే

ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్‌లో నిధులు తగ్గించడంతో ఎస్‌సి, ఎస్‌టిలకు కల్పించే పనుల విషయంలోనూ ప్రభావం చూపుతోంది. జిల్లాలో మొత్తం కూలీలకు కల్పిస్తున్న పనిదినాల్లో 2020-21లో ఎస్‌సిలకు 10.84 శాతం కల్పించారు. తర్వాత ఆర్థిక సంవత్సరంలో 10.82 శాతం మందికి పని ఇచ్చారు. గత ఆర్థిక సంవత్సరంలో 9.5 శాతం మందికి ఉపాధి చూపారు. 2020-21లో ఎస్‌టిలకు 10.50 శాతం పనిదినాలు కల్పించారు. తర్వాత ఆర్థిక సంవత్సరంలో 10.8 శాతం మందిని పని దినాలు కల్పించగలిగారు. గత ఆర్థిక సంవత్సరంలో 6.19 శాతం పని దినాలతో ఉపాధి చూపారు.

అధికారులను చుట్టుముట్టిన ఉపాధి కూలీలు

పనులు ఎందుకు ఆపేశారు?

- ఫీల్డ్ అసిస్టెంట్లను చుట్టుముట్టిన ఉపాధి కూలీలు
- అక్రమాలకు పాల్పడిన వారిని తొలగించాలి
- నౌపడ సచివాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - నౌపడ

సంతబొమ్మాళి మండలం నౌపడ పంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న నీలాపు ప్రసాద్‌రెడ్డి, బొమ్మాళి రామారావుపై ఉపాధి హామీ కూలీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నౌపడ పంచాయతీలో ఉపాధి అవకతవకలపై సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశాలతో డ్వామా అధికారులు సోమవారం విచారణ చేపట్టారు. ఫీల్డ్ అసిస్టెంట్లు ఉద్దేశపూర్వకంగా పనులు నిలిపివేస్తున్నారని కూలీలు సచివాలయం వద్దకు చేరుకున్నారు. నౌపడ పంచాయతీలో కూర్మనాథపురం, పాలనాయుడుపేట, జగన్నాథపురం, సీతానగరం గ్రామస్తులకు పని కల్పిస్తూ నౌపడ గ్రామస్తులకు మాత్రమే పనులు నిలిపివేయడంపై మండిపడ్డారు. తొలుత పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస రెడ్డి వద్ద తమ ఆవేదనను వ్యక్తం చేసి, పనులు కల్పించాలని కోరారు. దీంతో పంచాయతీ కార్యదర్శి ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లను పిలిపించి పనులు ఎందుకు ఇవ్వడం లేదని వివరాలు అడిగారు. పని ప్రదేశాలు దొరకడం లేదని, పనుల్లేవని ఫీల్డ్ అసిస్టెంట్లు పొంతన సమాధానం చెప్పారు. దీంతో కూలీలు ఒక్కసారిగా అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లను చుట్టుముట్టడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. మిగతా గ్రామాలకు పనులుంటే ఇంత పెద్ద గ్రామంలో పనులు లేకపోవడమేమిటని ప్రశ్నించారు. దీంతో సమాధానం చెప్పలేక ఫీల్డ్ అసిస్టెంట్లు ముఖం చాటేశారు. పలువురు తమ జాబ్‌కార్డులను ఎందుకు తొలగించారని వారిని నిలదీశారు.

ఏడాదిగా తాము ఉపాధి పనులకు దూరమయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. మరికొందరు తమ వద్ద నుంచి జాబ్‌కార్డు కోసం రూ.300, 400 చొప్పున వసూలు చేసి జాబ్‌కార్డు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ల అవినీతి బయటపడినా అధికారులు విచారణలో ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. కొంతమంది రాజకీయ నాయకుల ఒత్తిడితో విచారణ సరిగా సాగడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా విచారణ చేసి వారిని తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. వంద రోజుల పని కల్పించాలని, జాబ్‌కార్డు లేని వారికి కొత్త జాబ్‌కార్డులు అందించాలని కోరారు. దీనిపై పంచాయతీ అధికారులు హామీ ఇవ్వడంతో అక్కడ్నుంచి వెనుదిరిగారు.

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- 'స్పందన'కు 167 అర్జీలు
- రాష్ట్రంలోనే జిల్లాలో అత్యధిక పెండింగ్ వినతులు : కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వినతిపత్రం అందజేస్తున్న కలిశెట్టి అప్పలనాయుడు

అకాల వర్షాలు, ఈదురుగాలులకు పంటలను నష్టపోయిన రైతులను ఆదుకోవాలని పొందూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, టిడిపి నాయకులు కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ వినతులు స్వీకరించారు. ఎచ్చెర్ల నియోజకవర్గం పరిధిలోని లావేరు, రణస్థలం, ఎచ్చెర్ల, జి.సిగడాం మండలాల్లో కొన్ని రోజులుగా సంభవించిన అకాల వర్షాలు, ఈదురుగాలులకు అరటి, మామిడి పంటలుకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులతో కలిసి వినతిపత్రం అందించారు. అరటి, మామిడి పంటలకు అంచనాలు వేసి రైతులకు పరిహారం అందించాలని కోరారు. ఈనెల 22 నుంచి ఎచ్చెర్లలో నిర్వహిస్తున్న అసిరితల్లి ఉత్సవాల్లో ఇతర ప్రాంతాల నుంచి అత్యధిక మంది జనం తరలి రానున్నారని, ప్రజలకు అవసరమైన సురక్షిత మంచినీరును ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని విన్నవించారు.

బూర్జ మండలం పెద్దపేట పంచాయతీలో పింఛన్ల పంపిణీలో పెద్ద ఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయంటూ సర్పంచ్ ఆనెపు వరలక్ష్మి తరుపున ఆమె తనయుడు ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనెపు రామకృష్ణ ఫిర్యాదు చేశారు. పంచాయతీలో కొందరికి కనీసం 50 ఏళ్లు దాటకపోయినా ధ్రువీకరణ పత్రాలు జారీ చేసిన ఎంపిడిఒ రవీంద్రబాబుపై చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ సూచనతో జెసి, డిఆర్‌డిఎ పీడీ, డిపిఒతో విచారణ చేయాలని నిర్ణయించారు. సర్పంచ్ వరలక్ష్మిపై స్థానిక పంచాయతీ కార్యదర్శి కనీస గౌరవ మర్యాదలు పాటించడం లేదని చెప్పారు. ఎంపిడిఒ, పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎచ్చెర్ల మండలం తోటపాలెం రజకవీధిలో మున్సిపాలిటీ రోడ్లు, కాలువలు ఉపయోగించనీయకుండా స్థానిక శ్రీశయన కార్పొరేషన్ డైరెక్టర్ అడ్డుకుంటున్నారని, వాటికి అడ్డంగా గోడ కట్టేస్తామంటూ హెచ్చరిస్తున్నారని దీనిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు రామారావు, మనోజ్ తదితరులు కోరారు. హిరమండలం పింద్రువాడకు చెందిన గడియ వనజ మాట్లాడుతూ తాను లోలుగు తిరుపతిరావు వద్ద 2020లో భూమి తాకట్టు పెట్టి పలు సందర్భాల్లో రూ.నాలుగు లక్షల అప్పు చేశానని, భూమి విడిపించడానికి వెళ్తే రూ.13 లక్షలు కట్టాలని తిరుపతిరావు డిమాండ్ చేస్తున్నట్లు ఫిర్యాదు చేశారు.

జిల్లాలోనే అత్యధిక పెండింగ్ ఫిర్యాదులు

అపరిష్కృత ఫిర్యాదుల విషయంలో రాష్ట్రంలోనే జిల్లాలో అత్యధికంగా ఉన్నాయని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. స్పందనకు వచ్చిన వాటిలో జిల్లాకు సంబంధించి 37 ఫిర్యాదులు రీఓపెన్ అవుతున్నాయని చెప్పారు. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి అత్యధికంగా 12 ఉన్నాయని తెలిపారు. స్పందన అర్జీలపై ఈనెల 24న కలెక్టర్ నిర్వహించనున్న సమీక్షకు సంబంధిత బాధ్యులు హాజరు కావాలన్నారు. అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. స్పందనలో డిఆర్‌ఒ రాజేశ్వరి, డిప్యూటీ కలెక్టర్ జయదేవి, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్ వినతులను స్వీకరించారు. జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, డిఎంహెచ్‌ఒ బి.మీనాక్షి, డిఎస్‌ఒ వెంకటరమణ, డిపిఒ రవికుమార్, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వికలాంగులకు మోటార్ స్కూటర్లు పంపిణీ

జిల్లాలోని 20 మంది వికలాంగులకు వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యాన మోటార్ స్కూటర్లను కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ పంపిణీ చేశారు. సుమారు రూ.1.20 లక్షల ఖరీదు గల వాహనాన్ని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని ఆకాక్షించారు.

ఉద్యోగుల రిలే నిరాహార దీక్ష

ప్రజాశక్తి - పొందూరు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు ఉద్యోగులు పాత తాలూకా కేంద్రం పొందూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎపిజిఇఎ పొందూరు తాలూకా అధ్యక్షులు పంగా మోహనరావు మాట్లాడుతూ సిపిఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలన్నారు. ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో ఎపిజిఇఎ జిల్లా కార్యదర్శి అలికాన రాజేశ్వరి, పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కిల్లాన నారాయణరావు, జిల్లాపరిషత్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు పి.జయమ్మ, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆమదాలవలస అందగాడు ఇకలేరు

- సినీ నటుడు శరత్‌బాబు కన్నుమూత
- స్వస్థలం ఆమదాలవలసలో విషాదఛాయలు

ఆమదాలవలస అందగాడిగా పేరు తెచ్చుకుని, దక్షిణాది భాషల్లో ఎన్నో చిత్రాల్లో నటించిన సినీ నటుడు శరత్‌బాబు అనారోగ్యంతో సోమవారం కన్నుమూశారు. సినీ వినీలాకాశంలో ఆయన తనదైన ముద్ర వేశారు. హీరోగా, విలన్‌గా, సహాయ నటుడిగా పాత్ర ఏదైనా అందులోకి పరకాయ ప్రవేశం చేసి సహజ నటుడిగా ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకున్నారు. జిల్లా నుంచి ఎందరో నటులు సినీ పరిశ్రమ వైపు వెళ్లడానికి ఆయన ప్రేరణగా నిలిచారు. ఆయన మరణంతో స్వస్థలం ఆమదాలవలసతో పాటు జిల్లాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రజాశక్తి - ఆమదాలవలస

ఆమదాలవలస పట్టణంలోని డాబాలవారి వీధికి చెందిన విజయ శంకర దీక్షితులు, సుశీలా దేవికి 1951 జులై 31వ తేదీన శరత్‌బాబు జన్మించారు. 13 మంది సంతానంలో ఆయన నాలుగోవాడు. శరత్‌బాబు అసలు పేరు సత్యనారాయణ దీక్షితులు. ఇంట్లో అందరూ సత్యంబాబు అని పిలిచేవారు. ప్రాథమిక విద్యాభ్యాసం ఆమదాలవలసలో చేశారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాలలో బిఎస్‌సి చేశారు. కళాశాల చదివే రోజుల్లోనే నాటకాలు వేసేవారు. తొలిసారి 'దొంగాటకం' అనే నాటిక కోసం స్టేజ్ ఎక్కారు. శరత్‌బాబు తండ్రి రైల్వే క్యాంటీన్ నిర్వహించేవారు. ఆ తరువాత కాలంలో శ్రీకాకుళం రోడ్డు (ఆమదాలవలస) రైల్వేస్టేషన్‌కు ఎదురుగా మెయిన్ రోడ్డులో గౌరీశంకర్ హోటల్‌ను ప్రారంభించారు. ఆ హోటల్‌ను శతర్‌బాబు సోదరుడు చూసేవారు. కళాశాల చదువు పూర్తయిన వెంటనే అన్నయ్యకు సాయంగా ఆయన కూడా హోటల్ నిర్వహణ చూసేవారు. ఆ సమయంలో హీరోగా ప్రయత్నించేందుకు మద్రాసు వెళ్లాలని స్నేహితులు బలవంతం చేయడంతో, దర్శకుడు ఆదుర్తి సుబ్బారావుకు ఫోటోలు పంపారు. ఐపిఎస్ కావాలని కలలు కన్న ఆయన, వాటిని పక్కన పెట్టి మద్రాసు చేరుకున్నారు.

సినీ ప్రస్థానం

శరత్‌బాబు మద్రాసు వెళ్లిన సమయంలో రామా విజేత ప్రొడక్షన్స్ కొత్త హీరో కావాలని ప్రకటన ఇవ్వడంతో ఆడిషన్‌కు హాజరయ్యారు. మూడు వేల మంది ఆడిషన్‌కు రాగా, హీరోగా ఆయన్ను ఎంపిక చేయడంతో సినీ ప్రస్థానం ప్రారంభమైంది. జగ్గయ్య, ఎస్.వి రంగారావు, చంద్రకళ, సావిత్రి... ఇలా అగ్ర నటులతో కలిసి మొదటి సినిమా 'రామరాజ్యం' తెరంగ్రేటం చేశారు. 1973లో విడుదలైన ఆ సినిమా హీరోగా తొలి ప్రయత్నంలోనే గుర్తింపు లభించింది. 1974లో 'నోము'లో, 1975లో 'అభిమానవతి'లోనూ ప్రతినాయకుడిగా కనిపించారు. అలా ఆయనకు వరుసగా అవకాశాలు వచ్చాయి. 'నిళిల్ నిజమా గిరదు' అనే తమిళ సినిమా కోసం మొదటిసారి ప్రముఖ దర్శకుడు బాలచందర్ దర్శకత్వంలో నటించారు. కమల్‌హాసన్, అనంత్, శరత్‌బాబు ముగ్గురు హీరోలు. ఆ చిత్రం సూపర్ హిట్ కావడంతో తమిళంలోనూ వరుస అవకాశాలు వచ్చాయి.

ఆమదాలవలసలో శరత్‌బాబు నివాసం

బాలచందర్ తెరకెక్కించిన తెలుగు సినిమాలన్నింటిలో శరత్‌బాబు ఏదో ఒక రోల్‌లో కనిపించారు. సాగర సంగమంలో కమల్‌హాసన్ స్నేహితునిగా ఆయన నటన అందరి మనసులను హత్తుకుంది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ.. ఇలా ఆరు భాషల్లో హీరో, విలన్, సహాయ నటుడిగా 250కి పైగా చిత్రాల్లో నటించారు. 'మరో చరిత్ర, గుప్పెడు మనసు, శృంగార రాముడు, ఇది కథ కాదు, 47 రోజులు, సీతాకోక చిలుక, సితార, అన్వేషణ, స్వాతిముత్యం, సాగర సంగమం, సంసారం ఒక చదరంగం, అయ్యప్ప మహత్యం, క్రిమినల్, అన్నయ్య ఇలా ఎన్నో సినిమాలు తెలుగులో ఆయనకు నటుడిగా మంచి గుర్తింపును తెచ్చిపెట్టాయి. సినిమాల్లోనే కాకుండా సీరియల్స్‌లోనూ ఆయన రాణించారు. ఎన్నో అద్భుతమైన పాత్రలు పోషించి అందరి మన్ననలు అందుకున్నారు. క్యారెక్టర్ ఆర్టిస్టుగా మూడు నంది అవార్డులు పొందారు. వెండితెర పైనే కాదు బుల్లితెర వేదిక గానూ ప్రేక్షకులకు చేరువగా పలు సీరియల్స్‌లో నటించారు.

ఆమదాలవలస అంటే అభిమానం

ఆయన సినీ నటుడిగా బిజీ అయిన తర్వాత అప్పుడప్పుడూ ఆమదాలవలసలో ఉండే తన సోదరుని ఇంటికి వస్తుండేవారు. నటుడిగా మారాక చెన్నై, హైదరాబాద్‌లో స్థిరపడినా శ్రీకాకుళం జిల్లా అన్నా ప్రత్యేకించి ఆమదాలవలస అంటే ఆయనకు ఎనలేని అభిమానం. జిల్లావాసులు ఆయన్ను కలిసేందుకు వెళ్లినప్పుడు షూటింగ్ సమయంలోనైనా తీరిక చేసుకుని వచ్చి వాళ్లతో మాట్లాడేవారని ఆయన స్నేహితులు చెప్తున్నారు. సహజ నటనతో ప్రేక్షకుల హృదయాల్లో, ఆప్యాయతా అనురాగాలతో అభిమానుల గుండెల్లో మంచి స్థానాన్ని దక్కించుకున్న శరత్‌బాబు అకాల మరణంతో ఆమదాలవలస మూగబోయింది.

పలువురి సంతాపం

శరత్‌బాబు మృతికి తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్, అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.వి రాజారావు, మందపల్లి రామకష్ణ, గురుస్వామి తదితరులు వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు. శరత్‌బాబు తన సహజ నటనతో ప్రేక్షకులను కట్టిపడేసే వారని తెలిపారు. జిల్లాకు చెందిన గొప్ప నటుడిని కోల్పోవడం బాధాకరమని పేర్కొన్నారు.

పనిచేసే ప్రభుత్వంపై విమర్శలా..?

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - ఆమదాలవలస

సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న ప్రభుత్వంపై విపక్షాల విమర్శలు సరికాదని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. మున్సిపాల్టీ పరిధిలోని చింతాడలో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చెప్పిన ప్రతి పనినీ పూర్తి చేసేందుకు, ప్రకటించిన ప్రతి పథకాన్ని అమలు చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. హామీల్లో ఇప్పటికే 90 శాతానికి పైగా పూర్తి చేశామని చెప్పారు. గత టిడిపి ప్రభుత్వం చేయని పనులన్నీ వైసిపి ప్రభుత్వం చేస్తోందన్నారు. దీన్ని ఓర్వలేక సంక్షేమ రాజ్యంపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. సంక్షేమ పథకాల అమలుతో జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. గత ప్రభుత్వంలో ఏ పని చేయని వాళ్లు ఎవరి వృద్ధినీ పట్టించుకోని వారు నేటి అభివృద్ధిని విమర్శిస్తున్నారని ధ్వజమెత్తారు. సమాజంలో అన్ని వర్గాల జీవన ప్రమాణాలు పెరిగినాడే అభివృద్ధి అంటారని, గత ప్రభుత్వాలు ప్రజల జీవన ప్రమాణాలు ఎందుకు పెంచలేకపోయాయని ప్రశ్నించారు. ఇవాళ రూ.12 వేల కోట్లు వెచ్చించి భూమి కొని 32 లక్షల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామని చెప్పారు. చంద్రబాబు ఒక్క ఎకరా అయినా కొన్నారా? అని ప్రశ్నించారు. ప్రజలు గౌరవంగా బతికే విధంగా పథకాల ద్వారా అందించే ఆర్థిక లబ్ధి నేరుగా వారికే అందే విధంగా, వారి ఖాతాలకే జమ అయ్యే విధంగా పనిచేస్తున్నామన్నారు. గ్రామంలో తాగునీటి సమస్యను కొద్దిరోజుల్లో తీర్చేందుకు కృషి చేస్తానన్నారు. డ్రయినేజీ సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుంటానన్నారు. మేలు చేసే ప్రభుత్వానికి మరోసారి మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా రైతు విభాగం అధ్యక్షులు అంబటి శ్రీనివాసరావు, ఎఎంసి మాజీ చైర్మన్ బోర చిన్నంనాయుడు, బొడ్డేపల్లి రమేష్ కుమార్, దుంపల శ్యామలరావు, చింతాడ వెంకటరమణ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం అర్హులైన లబ్ధిదారులకు అందేలా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ రూపొందించిన జగనన్న ప్రభుత్వ సంక్షేమ క్యాలెండర్ 2023-24ను జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కలెక్టర్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను ఏ నెలలో సంబంధిత అధికారులు లబ్ధిదారులకు అందజేయాలో షెడ్యూల్ వివరిస్తూ కేలండర్‌లో ఉన్నాయని తెలిపారు. అధికారులు వారి శాఖకు సంబంధించిన ప్రభుత్వ పథకాలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల సూచనల మేరకు పంపిణీ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం రూపొందించిన 2023-24 ఆర్థిక సంవత్సర సంక్షేమ క్యాలెండర్ ను మంత్రులు, పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు,అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి ఎస్.వి రమణ, డిపిఆర్‌ఒ కె.బాలమాన్ సింగ్, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

మార్టును పరిశీలిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

మహిళా మార్టు ప్రారంభం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని రైతుబజారు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన వెయూత మహిళా మార్టును రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు సోమవారం ప్రారంభించారు. ముందుగా మార్టు నిర్వాహకులు మహిళలకు శు భాకాంక్షలు తెలిపారు. రూ.22 లక్షల వ్యయంతో స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యాన ఈ మార్టును ఏర్పాటు చేసినట్లు డిఆర్డిఎ పీడీ డి.వి.విద్యాసాగర్ తెలిపారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా అడుగులు వేయాలని, అందుకు ప్రభుత్వం ఇస్తున్న తోడ్పాటును వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా రైతు విభాగం అధ్యక్షులు అంబటి శ్రీనివాసరావు, ఎంపిపి నిర్మల శ్రీనివాస్, జెడ్పిటిసి రుప్ప దివ్య, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణ, చిట్టి రవికుమార్, పొన్నాడ రిషి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చల్లా అలివేలు మంగ, వి.సుజాత, సంజన పాల్గొన్నారు.

వాటర్ ఫౌంటెయిన్, స్వీపర్ మెషిన్...

నగరాన్ని సుందరీకరణకు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టి ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం, ఆరోగ్యవంతమైన జీవనం అందించడమే లక్ష్యమని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. సోమవారం రాత్రి నగరంలోని డే అండ్ నైట్ కూడలి వద్ద వాటర్ ఫౌంటెన్, మెకానికల్ స్వీపర్ మెషిన్ను ప్రారంభించారు. ఎన్ఎపి నిధుల నుంచి రూ.10 లక్షలతో డేఅండ్నైట్ కూడలి వద్ద వాటర్ ఫౌంటెన్, రూ.58 లక్షల నిధులతో మెకానికల్ స్వీపర్ మెషిన్ను ప్రారంభించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, కళింగ వైశ్య చైర్మన్ అంధవరపు సూరిబాబు, మున్సిపల్ మాజీ చైర్పర్సన్ ఎం.వి.పద్మావతి, చల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పి రాధిక

ఎస్పి స్పందనకు 33 వినతులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

స్పందనలో వచ్చిన ఫిర్యాదులను చట్టపరిధిలో పరిశీలించి ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం అందించాలని పోలీస్ అధికారులకు ఎస్పి జి.ఆర్.రాధిక ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం పోలీస్ స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో 33 అర్జీలు అందాయి. ఫిర్యాదుదారుల నుంచి ఎస్పితో పాటు డిఎస్పి జి.శ్రీనివాసరావు అర్జీలను స్వీకరించి క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఫిర్యాదిదారులు తమ అభ్యర్థనలను రాతపూర్వకంగా విన్నవించుకున్నారు. అనంతరం ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులు వివరాలు ఇలా ఇలా ఉన్నాయి. ఆస్తి తగాదాలపై 5, పౌర సంబంధాలకు (సివిల్) సంబంధిం చినవి 8, మోసపూరితమైన 3, కుటుంబ తగదాలకు సంబంధించినవి 4 ఫిర్యాదులు, ఇతర ఫిర్యాదులు 5, పాత అర్జీలు 8 వచ్చాయి. వారి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని భరోసా ఇచ్చారు. ఈ ఫిర్యాదులపై తీసుకున్న చర్యలపై జిల్లా కార్యాలయానికి ఎప్పటికప్పుడు నివేదిక అందజేయాలని ఆదేశించారు.

ఖాళీ స్థలాల పైనే కన్ను

- కోర్టు కేసులో ఉన్న భూముల్లో స్తంభాలు పాతిన వైనం
- భూ ఆక్రమణల్లో వైసిపి నాయకుల జోరు

వివాదాస్పద భూమిలో వేసేందుకు సిద్ధంగా ఉన్న స్తంభాలు

ప్రజాశక్తి- పలాస

జిల్లాలో సరవేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణాల్లో పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ ఒకటి. దేశంలో పలాస జీడిపప్పుకు ఎంత పేరు ప్రఖ్యాతలు ఉన్నాయో అదే స్థాయిలో పలాస కాశీబుగ్గ జంట పట్టణాలలో భూములకు అదే స్థాయిలో విలువ పెరిగిపోవడంతో భూ ఆక్రమణలకు అడ్డు, అదుపు లేకుండా పోతోంది. దీంతో భూ బకాసురులు అది డి పట్టా, ప్రభుత్వ భూమే, కొండ పోరం పోగా, గెడ్డ గయాల్, చెరువు గర్భమా, ఆ భూములు కోర్టు కేసులో ఉన్నాయా? అవేమీ వారికి అవసరం లేదు. వారి అజెండా ఖాళీ స్థలమే... వాటిని టార్గెట్ చేస్తూ భూ ఆక్రమణలకు పాల్పడడమే. దీంతో జంట పట్టణాల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని కాశీబుగ్గ పెట్రోల్ బంక్ నుంచి అక్కుపల్లికి వెళ్లే రోడ్డు మార్గంలో భరత్ గ్యాస్ గోదాంకు ఆనుకొని ఉన్న సర్వే నెంబర్ 391-6లో పది మూరల స్థలం కొత్తగా కబ్జాకు గురైంది. ఈ సలం వివరాలలోనికి వెళితే ఈ పదిమూరల స్థలంపై కాశీబుగ్గకు చెందిన కొత్తకోట జనార్ధనరావు, పిల్లి ఊర్మిల మధ్య వివాదం ఉంది. దీనిపై జనార్ధనరావు స్థలం తనదని దీనిపై ఊర్మిలకు ఎటువంటి హక్కులు లేవని తన వద్ద ఉన్న ఆధారాలతో పలాస కోర్టులో ఓఎస్-53-20018 నెంబర్ వాజ్యం దాఖలు చేసి ఉన్నారు. ఈ కేసులో ఉన్న స్థలంపై కోర్టులో విచారణలు జరుగుతూ వాయిదాలు పడుతూ కోర్టులో కేసు ఉంది. ఇంకా దీనిపై ఎటువంటి తీర్పు కోర్టు ఇవ్వలేదు. ఇంతలో పిల్లి ఊర్మిల కొంత మంది ఆక్రమణదారులతో చేతులు కలిపి ఈ స్థలంపైకి రావడం చదునుచేసి తమ

వివాదాస్పద స్థలం

ఆధీనంలోనికి తీసుకురావడం కోసం ప్రయత్నాలు ప్రారంభించింది. కోర్టు ద్వారానే పోరాటం చేయాల్సిన ఊర్మిల వైసిపి నాయకులు కొంత మంది కలిసి స్థలానికి కొంత ధర ఇప్పిస్తామని నమ్మబలికి ఆమెను ముందు నిలబెట్టి ఆక్రమణదారులు అర్ధరాత్రి, తెల్లవారుజాము సమయాలలో జెసిబితో చదును చేయించి, ఈ స్థలం ప్రాంతంలో స్తంభాలు పాతేందుకు సిద్ధమవుతున్నారు. కోర్టు కేసులో ఉన్న స్థలంపై ఎటువంటి పనులు చేయకూడదనే నిబంధన ఉన్నప్పటికీ దానిని అతిక్రమించి ఆక్రమణదారులు రాత్రికి రాత్రే ఆ స్థలంలో పనులు చేపడుతుండడంతో స్థల యజమాని జనార్ధనరావు ఆందోళన చెందుతూ పోలీసులు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని తెలుస్తోంది. ఆ ప్రాంతంలో మూర స్థలం విలువ లక్షల రూపాయలు ఉండగా ఆక్రమణదారులు జనార్ధనరావుకు కబురు చేసి మూర రెండు లక్షల రూపాయలు చెప్పున్న ఇవ్వాలని బెదిరిస్తున్నట్లు తెలుస్తోంది. ఆ స్థలం విడిచిపెట్టాలని, దీనిపై ఒప్పందం కుదుర్చుకునేందుకు తమ వద్దకు రావాలని పిలుస్తున్నారని బాధితుడు కొత్తకోట జనార్ధనరావు విలేకరుల ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ స్థలంపై కోర్టులో కేసు ఉండగా కోర్టు ఎలా తీర్పు ఇస్తే దానికి తాను కట్టుబడి ఉంటానని, అంతేకాకుండా కొంత మంది వైసిపి నాయకులు తమకు కబురు చేసి స్థలం తక్కువ ధరకు తమకు విక్రయించాలని బెదిరించడం సరికాదని జనార్ధనరావు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఇటీవల ప్రైవేట్ వ్యక్తుల జిరాయితీ, కోర్టులో ఉన్న స్థలం, వేరే ప్రాంతాల్లో ఉన్న వ్యక్తుల భూములను టార్గెట్ చేస్తూ ఆక్రమించేందుకు వైసిపి నాయకులు ప్రయత్నం చేశారు. కోర్టు కేసులో ఉన్న భూముల్లో రెండు వర్గాలను బెదిరించి భూములు సైతం ఆక్రమించేందుకు సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. వీటిపై రెవెన్యూ, పోలీసు అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని, స్థలంపై ఎటువంటి పనులు చేపట్టకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. దీనిపై అధికారులు స్పందన ఏవిధంగా ఉంటుందో వేచి చూడాలి.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి- పలాస

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తున్నామని మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని చినంచల, గోదావరిపురం, వీరరామచంద్రాపురం గ్రామాల్లో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మంత్రి అప్పలరాజుకు వైసిపి నాయకులు కార్యకర్తలు, గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? లేదా? లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక కారణాలతో ఎవరికైనా సంక్షేమ పథకాల అందకపోతే తక్షణమే అందేలా చూడాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు సరఫరా చేస్తామన్నారు. ఇప్పటికే రూ.700 కోట్ల వ్యయంతో పనులు జరుగుతున్నాయని, ప్రస్తుతం చివరి దశకు వచ్చాయని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడు నిధులతో సుందరంగా రూపుదిద్దుతామని అన్నారు. రైతులకు రైతు భరోసా, విద్యార్థులకు అమ్మఒడి వంటి సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్రెడ్డి నిరంతరాయంగా కొనసాగించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, సర్పంచ్ ప్రతినిధి కంచరాల భాస్కరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి, ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, గొర్ల వేణుగోపాల్, చింతాడ మాధవరావు, పొట్నూరు జాగారం

సోంపేట : సుందరరావుతో మాట్లాడుతున్న సాయిరాజ్

పలాస : ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

పాల్గొన్నారు.

సోంపేట : మండలంలోని కొర్లాం పంచాయతీ పరిధిలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రచారం నిర్వహించారు. సందర్భంగా విశ్రాంత వెటర్నరీ వైద్యుడు రత్నాల సుందర్రావును కలిసి క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సోంపేట, కంచిలి ఎంపిపిలు ఎన్.దాసు, పైల దేవదాస్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్లు నూతలపాటి బాబురావు, బథకాల మోహన్, సిఎస్ అధ్యక్షుడు రౌతు విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

ఇంటిపన్ను వసూలు సొంత అవసరాలకు వినియోగం

కార్యదర్శిపై కోటిపల్లి సర్పంచ్ సుధారాణి ఫిర్యాదు

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని కోటిపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న కోటిపల్లి, మజ్జిలపేట గ్రామాల్లో ఇటీవల వసూలు చేసిన ఇంటిపన్ను నిధులను పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ తన సొంత అవసరాలకు వినియోగించుకున్నట్లు సర్పంచ్ గురుగుబెల్లి సుధారాణి పేర్కొన్నారు. పంచాయతీలో పది మంది వాలంటీర్ల ద్వారా సేకరించిన రూ.1,02,550ల్లో రూ.5000లు మాత్రమే పంచాయతీ ఖాతాకు జమ చేశారని అన్నారు. మిగిలిన మొత్తాన్ని తన సొంత అవసరాలకు వినియోగించుకున్నారని ఆమె ఆరోపించారు. దీనిపై సేకరించిన ఇంటిపన్ను వివరాలతో కూడిన ఆధారాలతో కలెక్టర్కు, జిల్లా పంచాయతీ అధికారులకు సోమవారం ఆమె ఫిర్యాదు చేశారు. దీనిపై ఉన్నతాధి కారుల ఆదేశాల మేరకు పంచాయతీలో మంగళవారం ఎడిఎఎల్పిఒ విచారణ నిర్వహించనున్నట్లు మండల పరిషత్ ఎఒ మురళీకృష్ణ తెలిపారు.

25న జగనన్న ఆణిముత్యాల ప్రోత్సాహకాలు

ఇచ్ఛాపురం: రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖలో ఈ ఏడాది 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు "జగనన్న ఆణిముత్యాలు" ప్రోత్సాహకాలు అందజేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని ఎంఇఒ అప్పారావు తెలిపారు. ఈ పథకానికి అర్హులైన విద్యార్థులకు 25న పురుషోత్తంపురం మున్సిపాల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న కార్యక్రమంలో అందజేస్తామని పేర్కొన్నారు. ప్రథమ బహుమతిగా రూ.15 వేలు, ద్వితీయ రూ.10 వేలు, తతీయ రూ. 5వేలతో పాటు జ్ఞాపికలు అందజేసి శాలువాలతో సత్కరిస్తారని తెలిపారు. నియోజకవర్గంలో 10వ తరగతి విజేతలు కొంతాల విద్యారెడ్డి ఇచ్ఛాపురం, కవిటి మండలానికి పిట్ట ప్రమీల, కంచిలి మండలం నుంచి గేదెల నందిని, గుజ్జు ధనలక్ష్మి, శతి బెహేరా, పైల చాందిని, బోనెల హరిబాబు. ఇంటర్మీడియట్ స్థాయి మోడల్ స్కూల్ జూనియర్ కాలేజీ ఇచ్ఛాపురం నుంచి బచ్చు నందిని, ప్రభుత్వా జూనియర్ కాలేజీ ఇచ్ఛాపురం దుర్గాశి వనజ, మోడల్ స్కూల్ సోంపేట, అట్ల అమత, జూనియర్ కాలేజీ బారువ నవీన్ సిఇసి గ్రూపుల నుంచి ఎంపికయ్యారు. కార్యక్రమానికి నియోజకవర్గ స్థాయిలోను ప్రజా ప్రతినిధులు, అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అవార్డ్ గ్రహీతల తలిదండ్రులు, విద్యార్థులు, ఎంఇఒ పాల్గొవాలని కోరారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలో బుధవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్తారు బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కెవి పార్వతీశంపేట సబ్స్టేషన్ పరిధిలోని 11 కె.వి.వెంకయ్యపేట ఫీడర్ పరిధిలో మరమ్మతు పనులు, చెట్ల కొమ్మలు తొలగిస్తున్నామని అన్నారు. అందుకు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తిమ్మాపురం, జగ్గుశాస్త్రులపేట, ఆర్ఆర్ గ్రానైట్, మండాది బ్రిక్స్ ఏరియా తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని తెలిపారు. ఈ అసౌకర్యాన్ని ప్రజలందరూ గమనించి విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.

ఆరంగిపేటలో విషాదం

ప్రజాశక్తి- గార

సంతోష్ (ఫైల్)

తమిళనాడు రాష్ట్రం తిరుచునాపల్లిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని ఆరంగిపేటకు చెందిన యువకుడు మృతి చెందాడు. పొట్టచేత పట్టుకుని వలస వెళ్లిన మల్ల సంతోష్ (28) వృత్తిరీత్యా తమిళనాడు తిరుచినాపల్లిలో లోడర్ ఆపరేటర్గా పి.ఎస్.కె ఇన్ఫ్రా స్ట్రక్చర్ అండ్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్లో కొన్నేళ్లుగా పనిచేస్తున్నాడు. తోటి కార్మికుల సహాయం కోసం సంస్థకు చెందిన ద్విచక్ర వాహనంపై తేనేటి పానీయం తేవడానికి వెళ్లాడు. బైక్ను లారీ ఢీకొనటంతో ప్రమాదస్థలంలోనే మృత్యువాత పడ్డాడు. కంపెనీ యాజమాన్యం ఫోన్లో సంతోష్ సోదరుడికి సమాచారం అందజేశారు. హుటాహుటిన తిరుచునాపల్లి బయలుదేరారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

కమిషనర్కు సమస్యలు వివరిస్తున్న గొండు శంకర్

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని పెద్దరెల్లివీధిలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని సర్పంచ్ల సంఘం జిల్లా అధ్యక్షులు, టిడిపి నాయకులు గొండు శంకర్ కోరారు. ఈ మేరకు నగర సమస్యలతో కూడిన నివేదికను నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఛాంబరులో సమస్యలను సోమవారం వివరించారు. మురుగుతో నిండిన కాలువలు, మూలకు చేరిన సామూహిక మరుగుదొడ్లు, నిత్యం దోమలతో సహవాసం చేయాల్సి వస్తోందని అన్నారు. ఈ ప్రాంతంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. అలాగే దమ్మలవీధిలో తాగునీటి ఓవర్ హెడ్వాటర్ ట్యాంకు ఉన్నా సమీపాన గల పొన్నాడ వీధిలోని రామ మందిరం పరిసర ప్రాంతాల ప్రజలకు తాగునీటి సరఫరా కావడం లేదని వివరించారు. గతంలో ఈ సమస్యలను సచివాలయ సిబ్బందికి విన్న వించినా పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. ఆయనతో పాటు మాజీ కౌన్సిలర్ అంబటి లక్ష్మీరాజ్యం, ఎఎంసి మాజీ డైరెక్టర్ బోల్ల నాగేంద్ర యాదవ్, టిఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు రెడ్డి గిరిజాశంకర్, దేవళ్ల విస్సూ, చింతనిప్పుల రాజేంద్ర, వారధి సూర్యనారాయణ, చీపురు రమణ పాల్గొన్నారు.

ఘనంగా గౌతు శివాజీ జన్మదిన వేడుకలు

పలాస: పలాస టిడిపి కార్యాలయంలో సోమవారం మాజీ మంత్రి గౌతు శ్యాం సుందర శివాజీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా గౌతు శివాజీ కేక్ కట్చేసి నాయకులు, కార్యకర్తలకు పంచి పెట్టారు. అనంతరం టిడిపి నాయకుడు శివాజీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు, రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కష్ణారావు, నాగరాజు నవీన్, శాసనపురి మురళీ కష్ణ, టంకాల రవి శంకర్ గుప్త, కొవ్వూరు సురేష్ జోగ మల్లి డొక్కరి శంకర్ ఆత్మరావు, పైల చక్రధర్ బూరెల విజయ్ బూరెల కష్ణంరాజు, టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న టిడిపి నాయకులు

నేటి నుంచి ఉచిత వేసవి శిబిరం

శ్రీకాకుళం అర్బన్ : క్రియేటివ్ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యాన మంగళవారం నుంచి ఈ నెల 29 వరకు యుటిఎఫ్ కార్యాలయంలో చిన్నారులకు ఉచిత వేసవి శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ కన్వీనర్ చింతాడ కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో చిన్నారులకు చిత్రలేఖనం, నాటిక, క్విజ్, పాటల పోటీలు, కవితలు, ఆత్మరక్షణ విద్య, తదితర అంశాలపై శిక్షణ ఇస్తామని అన్నారు. రోజూ ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు శిబిరం కొనసా గుతుందని, ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహి స్తున్నామని తెలిపారు. చిన్నారులు ఈ అవకాశా న్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పిఎన్ కాలనీలో చలివేంద్రం ఏర్పాటు

శ్రీకాకుళం అర్బన్ : సత్యసాయి సేవా కేంద్రం ఆధ్వర్యాన నగరంలోని పి.ఎన్ కాలనీ కూడలిలో సత్యసాయి సేవా సంస్థల జిల్లా కో-ఆర్డినేటర్ సూర రామచంద్రరావు సోమవారం చలివేంద్రా న్ని ప్రారంభించారు. వేసవి తాపం తీర్చుకోవడా నికి పాదచారులకు, వాహనదారులకు, రిక్షా, ఆటో కార్మికులకు ఎంతగానో ఉపయోగపడుతుం దని అన్నారు. పట్టణంలోని సత్యసాయి మందిరాలు, రిమ్స్, అన్నపూర్ణ సేవా కేంద్రం సౌజన్యంతో అనేక రద్దీ ఉన్న ప్రాంతాల్లో చలివేం ద్రాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్టిసి కాంప్లెక్స్ వద్ద నిరంతరాయంగా మజ్జిగ పంపిణీ చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బసవ గొల్లబాబు, మందిరం కన్వీనర్ ఎన్.రమణమూర్తి, కో-ఆర్డినేటర్లు కె.గణపతిరావు, పి.ఆనందరావు, కె.అప్పలనాయుడు పాల్గొన్నారు.

తాగునీటిని అందిస్తున్న సత్యసాయి సేవకులు

సూరిబాబును సత్కరిస్తున్న 'గుండ' దంపతులు

పార్టీని బలహీనపర్చడానికే తప్పుడు ప్రచారం

శ్రీకాకుళం అర్బన్ : సమర్థత, పార్టీ పట్ల నిబద్ధతతో, క్రమశిక్షణతో పనిచేసే వారికి తాము ఎల్లప్పుడూ గౌరవించి, గుర్తించి పదవులు ఇస్తున్నామని, కానీ, కొందరు ఉద్దేశ్య పూర్వకంగా తమపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తూ తెలుగుదేశం పార్టీకి నష్టం చేకూర్చేందుకు ప్రయత్ని స్తున్నారని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనా రాయణ ఆరోపించారు. అరసవల్లిలోని ఆయన స్వగృహంలో జంగమ సాధికార కమిటీ సమావేశంలో సోమవారం పాల్గొని మాట్లాడారు. మానసికంగా తనతో పాటు తన భార్య మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పట్ల ఉద్దేశ్యపూర్వకంగా కొందరు అవమానించే రీతిలో పోస్టింగ్లు పెడుతున్నారని అన్నారు. ఎవర్ని బాధపెట్టే సంస్కృతిని తామెప్పుడూ కార్యకర్తలకు బోధించలే దని, ప్రత్యర్థులను సైతం సిద్ధాంతపరమైన విమర్శలు తప్ప... వ్యక్తిగత విమర్శలు, చులకగా మాట్లాడే పరిస్థితి లేదన్నారు. చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి కావాలన్నదే తమ లక్ష్యమని, పార్టీ ప్రయోజనాలను దెబ్బతీసేలా కొందరు వ్యవహరించడం సరికాదని అన్నారు. పదవులకు అర్హులే అని, కానీ, అందరికీ ఒకేసారి పదవులు కేటాయించడం కుదరదని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, జంగం సాధికార కమిటీ డైరెక్టర్ విభూది సూరిబాబు, నాయకులు కుమారస్వామి, నాగరాజు, గౌతమ్కుమార్ పాల్గొన్నారు. అనంతరం గుండ దంపతులు సూరిబాబుకు దుశ్శాలువ కప్పి సన్మానించారు.

వంశధార ఎడమ కాలువ గట్టు ఎత్తు పెంచాలి

ప్రజాశక్తి- పలాస

వంశధార చివరి భూములకు సాగు నీరు అందాలంటే హిరమండలం గొట్టా బ్యారేజి నుంచి నందిగాం వరకు గట్టు ఎత్తు కనీసం 4 అడుగులు పెంచాలని ఎపి రైతు సంఘం జిల్లా నాయకులు బమ్మిడి ఆనందరావు, బి.రామకష్ణ, కె.బాలరాజు డిమాండ్ చేశారు. ఆర్డిఒ టి.సీతారామ్మూర్తికిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శివారు భూములకు నీరు రావాలంటే 2,400 క్యూసెక్కుల నీరు అవసరం ఉందన్నారు. కాలువలో పూడికతీతతో పాటు గట్టు ఎత్తు పెంచితే తప్ప నీరు అందే పరిస్థితి లేదన్నారు. జనవరి నుంచి జూన్ వరకు కాలువలు మరమ్మతులు చేపట్టేందుకు అనుకూలమైన సమయం అయినా, ఆ దిశగా మరమ్మతులు ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు. వినతి పత్రం అందజేస్తున్న వారిలో ఎస్.మోహనరావు, ఎన్.చంద్రయ్య పాల్గొన్నారు.

రామారావు భార్యకు నగదు అందజేస్తున్న సభ్యులు

రామారావుకు 'మాతృమూర్తి' అండ

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- కవిటి

బోన్ కేన్సరుతో బాధపడుతున్న కవిటి మండలం కొమ్ముపుట్టుగకు చెందిన తోట రామారావుకు మండలానికి చెందిన మాతృమూర్తి యువజన సేవా సంఘం అండగా నిలిచింది. ఇటీవల ప్రజాశక్తిలో వచ్చిన 'ఆ పాటకు ప్రాణం పోద్దాం' కథనానికి స్పందించి సోమవారం రామరావు కుటుంబాన్ని సంఘం సభ్యులు పరామర్శించారు. రామారావు వైద్యం కోసం తక్షణ సహాయంగా రూ.5 వేలు అందజేశారు. అనంతరం సభ్యులు మాట్లాడుతూ రెక్కాడితే గానీ డొక్కాడని రామారావు కుటుంబ పరిస్థితి గుర్తించి, అతడి వైద్యం కోసం దాతలు, స్వచ్ఛంద సంస్థలు ఉదారంగా ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చలపతి, నాగు, మోహనరావు, రమేశ్, కేశవరావు, సోమేశ్, కీలు మోహన్, తదితరులు పాల్గొన్నారు.

హరిశ్చంద్రపురం సచివాలయం ప్రారంభం

ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

కోటబొమ్మాళి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు గ్రామ, వార్డు సచివాయాలను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్రెడ్డి ప్రారంభించారని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని హరిశ్చంద్రపురం పంచాయతీలో రూ.40 లక్షల వ్యయంలో నిర్మించిన సచివాలయ కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారని అన్నారు. అనంతరం సర్పంచ్లు, ఎంపిటిసిలు శ్రీనివాస్కు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, మండల సచివాలయ కన్వీనర్ల ఇన్ఛార్జి గడ్డవలస నాగభూషణరావు, సర్పంచ్ గురువెల్లి కేశవరావు, ఎంపిటిసి బాగాది దివాకర్, పూజారి సత్యం, వైసిపి మండల అధ్యక్షులు నూక సత్యరాజు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు దక్క రోజా, సర్పంచ్లు కళ్ల సంజీవరావు, సంపతిరావు వెంకటరమణ, జిల్లా రైతుభరోసా అడ్వైజరీ కమిటీ సభ్యులు కవిటి రామరాజు, బమ్మిడి శ్రీనివాస్, చాప మాధవ్, బోయిన కృష్ణారావు పాల్గొన్నారు.

కార్నియా సేకరణ ప్రారంభం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రెడ్క్రాస్ ఆధ్వర్యాన మగటపల్లి వెంకట రమణమూర్తి ట్రస్టు నిర్వహిస్తున్న కార్నియా సేకరణ మళ్లీ మొదలైందని సంస్థ చైర్మన్ పిజగన్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. సాంకేతిక నిపుణులు లేని కారణంగా ఈ సేవలు నిలిచి పోయాయన్నారు. కొత్తగా కంటి సాంకేతిక నిపుణురాలు పి.సుజాత ట్రస్టు ద్వారా హైదరాబాద్ ఎల్.వి.ప్రసాద్ కంటి ఆస్పత్రిలో శిక్షణ పొంది తిరిగి బాధ్యతలు చేపట్టడంతో తిరిగి సేకరణను ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. కార్నియా సేకరణకు వీలుగా సమాచారం తెలిపేందుకు 7799334321, 7842699321, 9533347470, 0892-226555 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

నేత్రాలపై అప్రమత్తం

రణస్థలం: ప్రతిఒక్కరూ నేత్రాలపై అప్రమత్తంగా ఉండాలని కళ్యాణి కంటి ఆస్పత్రి వైద్యులు కళ్యాణి అన్నారు. మండల కేంద్రంలో కళ్యాణి కంటి ఆస్పత్రి ఆధ్వర్యాన సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరానికి 85 పాల్గొన్నారు. వీరికి వైద్య పరీక్షలు నిర్వహించి 14 మందికి కంటి శస్త్ర చికిత్సకు ఎంపిక చేసి విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి బస్సులో తరలించారు. ఈ సందర్భంగా డాక్టర్ కళ్యాణి మాట్లాడుతూ వయసు పెరుగుతున్న కొద్దీ కంటి సమస్యలు వచ్చే అవకాశాలు ఉంటాయని అన్నారు. కంటి శుక్లం, శస్త్ర చికిత్స తర్వాత కళ్లను జాగ్రత్తగా చూసుకోవడం ముఖ్యం.ఏవైనా సమస్యలు ఉంటేనే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

శస్త్రచికిత్స కోసం బస్సులో తరలిస్తున్న రోగులు

కిడ్నీ వ్యాధితో మృతి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

అనసూయ (ఫైల్)

కిడ్నీ వ్యాధికి గురై మరో ప్రాణం బలైంది. అక్కుపెల్లికు చెందిన కోడ అనసూయ(57) కొన్నేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతు సోమవారం తుదిశ్వాస విడిచారు. మృతురాలు పలాస ప్రభుత్వాస్పత్రిలో కొంతకాలంగా డయాలసిస్ సేవలు పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. భర్త దేసయ్యతో పాటు ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. ఉద్దానం తీర ప్రాంతంలో కిడ్నీ రోగులు రోజురోజుకు పిట్టల్లా రాలిపోతుండంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు

టెక్కలి: టెక్కలి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం హాజరైన విద్యార్థులకు చదరంగం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి ఎస్.ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో చదరంగం పోటీలు నిర్వహించగా గిరిబాబు, సుదర్శన్ పర్యవేక్షణలో ఇంగ్లీష్ వ్యాకరణంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది అమ్మనమ్మ విద్యార్థులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

రేషన్ లబ్ధిదారుల ఆందోళన

కంచిలి: మండలంలోని బొగాబని పంచాయతీ, కుమ్మరిపేటకు చెందిన సుమారు 68 కుటుంబాలకు రెండు నెలలగా ప్రభుత్వం మంజూరు చేసిన రేషన్ బియ్యం అందడం లేదని లబ్ధిదారులు సోమవారం కంచిలి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. స్థానిక సర్పంచ్ గోనప సింహాచలం ఆధ్వర్యంలో లబ్ధిదారులు తహసీల్దార్ హైమావతికి వినతి పత్రం అందజేశారు. గ్రామంలో అందరూ నిరుపేదలమని, రేషన్ బియ్యం ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులు తక్షణమే స్పందించి తమకు రేషన్ బియ్యం అందించేలా చూడాలని వారు కోరారు.

శరత్బాబు మృతికి నివాళి

టెక్కలి: సినీ నటుడు, జిల్లాకు చెందిన కళాకారుడు శరత్బాబు మృతికి సుదర్శన థియేటర్ మేనేజర్ సత్తారు వెంకటరమణ సంతాపాన్ని తెలియజేశారు. ఈ మేరకు సోమవారం థియేటర్ ఆవరణలో శరత్బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సుమారు 200కు పైగా సినిమాల్లో నటించిన శరత్బాబు మతి కళారంగానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బాలకష్ణ, వెంకటేష్, రామకష్ణ, థియేటర్ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షిస్తున్న తిలక్

త్వరితగతిన నాడు- నేడు పనులు

ప్రజాశక్తి- నందిగాం

మండలంలో నాడు నేడు పథకంలో భాగంగా చేపడుతున్న పనులు త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ కోరారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి అధ్యక్షతన నాడు నేడు పనుల ప్రగతిపై జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాడు నేడులో భాగంగా చేపడుతున్న అంగన్వాడీ భవనాలు, పాఠశాల అదనపు గదుల నిర్మాణం, పాఠశాలలో 10రకాల మౌళిక సదుపాయాల పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ సిబ్బంది విద్యా కమిటీ చైర్మన్లు సమన్వయంతో పనిచేసి పనులు ప్రగతికి పాటుపడాలని ప్రభుత్వం విడుదల చేసిన నిధులు త్వరితగతిన పనులుచేసి ఖర్చు చేయాలని ప్రస్తుతం పాఠశాలలకు సెలవుల దష్ట్యా పాఠశాలలు ప్రారంభమయ్యేలోపు పనులు పూర్తయ్యేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హెచ్.వి.రమణమూర్తి, ఎంఈఓ నరసింహులు, నాడు నేడు ఇంజనీరింగ్ అధికారి బెనర్జీ, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు చిన్ని జోగారావు యాదవ్, ఏపీఎం నీలవేణి, సర్లాన బైరాగి, మల్ల సీతారాం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్లు ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత అవసరం...

మానవులకు ఆధ్యాత్మికత చాలా అవసరమని పేరాడ తిలక్ అన్నారు. నందిగాం గణేష్ కాలనీలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో సోమ వారం ఆయన పాల్గొన్నారు. ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తితో కలిసి పత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పురోహితులు రేజేటి బోసి బాబు, మేడేపల్లి రమేష్ శర్మ ఆధ్వర్యంలో ప్రతిష్ఠ కార్యక్రమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, ఎంపీటీసీ సభ్యుడు అంబోడి విష్ణు, సైలాడ సర్పంచ్ శంభాన దానయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి

పలాస : ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థిగా ఉండాలని అందుకు ఈ వత్యంతర శిక్షణ ఉపయోగపడుతుందని కోర్స్ డైరెక్టర్ వై.చిన్నమనాయుడు చెప్పారు. కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్న త పాఠశాలలో 1998 డిఎస్సి 2008 డీఎస్సీ 2018 డిఎస్సిలకు చెందిన ఉపాధ్యాయులకు ఇండక్షన్ ట్రైనింగ్ పేరిట రెండో విడత శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా కోర్స్ డైరెక్టర్ మాట్లాడుతూ ఐదు రోజులు జరిగే శిక్షణలో అంశాలు తరగతి గదిలో బోధించాలన్నారు. కోర్సు సమన్వయకర్త ఎస్.సూర్య ప్రకాష్ డైట్ అధ్యాపకులు బలివాడ సతీష్ మాట్లాడుతూ పాఠశాల నిర్వహణ విషయా లు శిక్షణ ద్వారా అందివ్వనున్నామని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమానికి రాష్ట్ర రిసోర్స్ పర్సన్లు ఎల్.వెంకటాచలం, ఆర్.వి.రమణ మూర్తి, షణ్ముఖరావు, ముఖలింగం, పట్నాయక్, జి.వాణి కుమారి, వ్యవహరిస్తున్నారు. ఈ సభలో పలాస డివిజన్ కేంద్రంలోని పాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్ కె.హరిబాబు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులకు నగదును అందజేస్తున్న స్నేహితులు

స్నేహితుని కుటుంబానికి బాసట

వజ్రపుకొత్తూరు : తమతో పాటు చదువుకున్న స్నేహితుడు ప్రమాద వశా త్తు మత్యువాత పడితే తోటి స్నేహితులు ఆ కుటుం బాన్ని ఆదుకుని తమ ఔదార్యం చాటుకున్నారు. పల్లివూరు పం చాయతీ బెజ్జివానిపేట గ్రామానికి చెందిన బెజ్జి ధర్మారావు కొన్నాళ్ల కిందట విద్యుత్ షాక్‌తో మృతి చెందారు. ఆయనతో చదువుకున్న 2002-03 పదో తరగతి బ్యాచ్ సభ్యులు రూ.85 వేలు సేకరించి ఆ కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మామిడి భాస్కర రావు, డి.విశ్వనాథం, ఎ.నాగరాజు పాల్గొన్నారు.

పశువైద్య సహాయకులను నియమించాలి

కోటబొమ్మాళి: మూడేళ్లుగా పశుసంవర్ధకశాఖలో ఖాళీగా ఉన్న పశువైద్య సహాయకులు పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగులను ఆదుకోవాలని జిల్లాలకు సంబంధించిన మేనేజ్‌మెంట్, వెటర్నరీ పాలిటెక్నికల్, డెయిరీ సైన్స్ చదువుకున్న విద్యార్థులు కోరారు. ఈ మేరకు పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజును కలిసి సోమవారం వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో మూడేళ్ల నుంచి 30 వేలు మంది విద్యార్థులు డెయిరీ మేనేజ్‌మెంట్, వెటర్నరీ పాలిటెక్నికల్ కోర్సులను పూర్తిచేసి ఉన్నామని అన్నారు. పోస్టుల నోటిషికేషన్ విడుదల చేయాలని కోరారు.

ఉత్సవాలను విజయవంతం చేయాలి

టెక్కలి : ఈనెల 27వ తేదీ నుంచి రాజమండ్రిలో జరగనున్న ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు, మహానాడును విజయ ఎవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ టెక్కలి మండల అధ్యక్షుడు బగాది శేషగిరిరావు పిలుపునిచ్చారు. ఆ పార్టీ కారా ్యలయంలో ఆయన సోమవారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలోని 8 బస్సులు బయలుదేరనున్నాయని తెలిపారు. హనుమంతు రామకృష్ణ, మామిడి రాము, మెండ దమయంతి, జీరు వెంకటరెడ్డి, లవకుమార్ పాల్గొన్నారు.

రూ.14 లక్షలతో శ్మశానవాటిక అభివృద్ధి

అభివృద్ధికి నోచుకున్న శ్మశానవాటిక

ప్రజాశక్తి- రణస్థలం

పరిశ్రమల అభివృద్ధి, కార్మిక సంక్షేమం రెండు కళ్లుగా ఈ ప్రాంత అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఆంధ్రాఆర్గానిక్ పరిశ్రమ యాజమాన్యం చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలను అభినందిస్తున్నారు. మండలంలోని పారిశ్రామికవాడ పైడిభీమవరం దేవాంగుల వీధికి దగ్గరలో ఉన్న శ్మశాన వాటిక ఎన్నో ఏళ్ళుగా చెత్తాచెదారం, ముళ్లకంపలతో నిండిపోయి ఉంది. ఎవరైనా మృతి చెందితే దహన కార్యక్రమాలు చేయాలంటే భయంగా ఉండేది, గ్రామస్తులు నానా ఇబ్బంది పడేవారు. ఈ విషయాన్ని సర్పంచ్ సింక భవాని సర్పంచి ప్రతినిధి రౌతు శ్రీనివాసరావు ఆంధ్రాఆర్గానిక్ పరిశ్రమ జనరల్ మేనేజర్ కృష్ణయ్య దృష్టికి తీసుకెళ్లారు. ఆయన తక్షణమే స్పందించి విర్కొకో ఫౌండేషన్ దృష్టికి తీసుకువెళ్లారు. వారు తక్షణమే స్పందించి ఆంధ్రా ఆర్గానిక్స్ ఆధ్వర్యాన శ్మశాన వాటిక పనులను ప్రారంభించారు. శ్మశాన వాటిక చుట్టూ ప్రహరీ నిర్మించి అక్కడ ఉన్న చెత్త చెదారం ముళ్లకంపలను తొలగించారు, ఆ లోపల ఎవరూ వ్యర్థాలు వేయివ్వకుండా ఉండేందుకు గేటును ఏర్పాటు చేశారు, గ్రామం నుంచి శ్మశాన వాటికి వెళ్లే అందుకు రహదారి నిర్మించారు. అందుకు రూ.14 లక్షలను ఆంధ్రా ఆర్గానిక్స్ యాజమాన్యం వెచ్చించింది. దానికి తోడుగా పైడిభీమవరం పంచాయతీ మరో రూ.ఆరు లక్షలు వెచ్చించి శ్మశాన వాటికలో మౌలిక వసతులు కల్పించారు. ఎన్నో ఏళ్లుగా నోచుకోని శ్మశాన వాటి క అభివృద్ధికి ఆంధ్రా ఆర్గానిక్ యాజమాన్యం అందించిన సహాయంపై గ్రామస్తులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

వాలంటీర్ల సేవలు ప్రశంసనీయం

జలుమూరు: గ్రామ వలంటీర్ల సేవలు అభినందనీయమని వైయస్సా ర్సీపి రాష్ట్ర సిఇసి మెంబర్ ధర్మాన పద్మప్రియ అన్నారు. మండలంలోని లింగాలవలస, చల్లవానిపేట, తలతరియ, జోణంకి సచివాలయాల వద్ద సోమవారం వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాలంటీర్లను ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ముందుగా వాలంటీర్లతో కలిసి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఆమె తోపాటు ఎంపీపీ వాన గోపి, మండల వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు కనుసు సీతారాం, వైస్ ఎంపిపి తంగి మురళీకష్ణ, ఆయా సచివాలయాల పరిధిలోని సర్పంచులు, పంచాయతీ విస్తరణ అధికారి పి.ఉమా మహేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ప్రభుత్వం పథకాలను ప్రజలకు నిస్వార్థంగా అందించడంలో వాలంటీర్ల సేవలు ప్రశంసనీయమని వార్డ్ కౌన్సిలర్లు నీలపు లక్ష్మి, పిలకా ఈశ్వరి ప్రశంసించారు. స్థానిక సచివాలయంలో సోమవారం వాలంటీర్లకు సన్మానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ ప్రతినిధులు నీలపు డిల్లీ, పిలకా విజయా భాస్కర రెడ్డి, సచివాలయం వాలంటీర్లు, సెక్రటరీలు పాల్గొన్నారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పద్మప్రియ

మెళియాపుట్టి: వాలంటీర్ల సేవాలు మరువలేనివని, వారి సేవలు గుర్తింపు ఎల్లప్పుడూ ఉంటుందని ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్‌కుమార్ అన్నారు. మండలంలో పెద్దలక్ష్మీపురం గ్రామ సచివాలయ పరిధిలోని వాలంటీర్లకు సన్మానించారు. గంగరాజపురం సర్పంచ్ ప్రతినిధి వట్టికూల శంకరరావు, కార్యదర్శి జి.వి.ఎల్.ప్రసాద్ పాల్గొన్నారు.

వార్డు సమస్యలు పరిష్కరించాలని వినతి

వినతిపత్రం అందజేస్తున్న జగన్నాయకులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 18వార్డ్‌లో రత్తకన్న గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని వార్డ్ కౌన్సిలర్ చిదిపోతు జగన్నాయకులు మున్సిపల్ కమిషనర్ రమేష్‌కి వినతిపత్రం సమర్పించారు. వార్డ్‌లో ఉన్న కాలువపై కవర్ స్లాబ్‌లు ఏర్పాటు చేయాలని అవి లేకపోవడం వల్ల ప్రమాదాలు జరిగి పలువురు గాయాలు పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా క్వారీ రోడ్డులో పేరుకు పోయిన మట్టి ను తొలగించమని ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. వార్డ్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థులతో ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు

విద్యార్థులకు అభినందన

పజాశక్తి- కవిటి

ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో 500 మార్కులు పైబడి వచ్చిన 24 మంది విద్యార్థులను బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక ప్రజా ప్రతినిధులు సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా 579 మార్కులతో మండలంలో ద్వితీయ స్థానంలో నిలిచిన ఎస్.రాఘవి, 576 మార్కులు సాధించిన రోచర్మయిని అభినందించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి మాట్లాడుతూ అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులిచ్చి సత్కరించారు. కార్యక్రమంలో హెచ్.ఎంఎస్ రామకష్ణ, సర్పంచ్ బి.శ్రీరాం ప్రసాద్, ఎంఎటిసి డి.సతీష్ కుమార్, గెస్ట్ సంస్థ అధ్యక్షుడు బి.శంకరరావు, బల్లెడ జయ ప్రకాష్, డి.దీనబంధు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు శాఖాగ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగాగ్రంథాలయ అధికారి పి.వి.భాస్కర్‌రాజా గ్రంథాలయాల ఆవశ్యకతపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ వ్యాసరచన పోటీలో 18 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

బలగ: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బలగ శాఖాగ్రంథాలయంలో పిల్లలకు ఆటపాటలు ఆడిపించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేను మాట్లాడుతూ పిల్లలు సెల్ ఫోన్లకు, టివిలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో 27 మంది పిల్లలు, కె.అనిత పాల్గొన్నారు.

ఆరోగ్యంగా ఉండాలి

లావేరు : విద్యార్థులు చదువుకు ఎంత ప్రాధాన్యత ఇస్తారో ఆరోగ్యానికీ అంతే ప్రాధాన్యత ఇవ్వాలని రిసోర్స్ పర్సన్ ప్రగడ రామ్‌దేవ్ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మురపాక శాఖాగ్రంథాలయంలో ఆరోగ్యమే మహాభాగ్యం అనే అంశంపై విద్యార్థులకు వివరించారు. ప్రతి విద్యార్థీ వేకువజామున 5 గంటలకు లేచి వ్యాయామం చేయాలని సూచించారు. ఇలా చేయడం వల్ల ఆరోగ్యం వంతులుగా ఉంటాంన్నారు. కార్యక్రమంలో గ్రంథాల యాధికారి మురపాక శ్రీనివాసరావు, సహాయకులు పి.షణ్ముఖరావు పాల్గొన్నారు.

సోంపేట: బారువ శాఖాగ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్ష ణ తరగతులకు విశేష స్పందన లభిస్తోందని గ్రంథాలయ అధికారి ధర్మారావు తెలిపారు. సోమవారం తరగతులకు హాజరైన విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, సోషల్ స్టడీస్ తరగతులను నిర్వహించారు. స్థానిక ఉపాధ్యాయులు జీవన్, వెంకట్రావుతో పాటు గ్రంథాలయ సభ్యులు శ్రీను, రవి రఘు పాల్గొన్నారు.

రక్షణ గోడ నిర్మాణానికి శంకుస్థాపన

మెళియాపుట్టి: టిడిపి హయాంలోనే అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ అన్నారు. మండలంలోని మర్రి పాడు-సి పంచాయతీలో బంజీరు గ్రామం వద్ద ఎంపీ కింజ రాపు రామ్మోహన్ నాయుడు నిధుల నుంచి రూ.పది లక్షలతో రక్షణ గోడ నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధికి టిడిపి ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు భాస్కర్‌గౌడ, సర్పంచ్ ప్రతినిధి రవ్వల గణపతిరావు, బి.లలితకుమారి, బి.భాస్కరరావు, కె.శంకర్, అప్పారావు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటరమణ